
E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 16-09-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ఎర్రకోటకు నల్లచారలు » 3లో



## ఫీజు' చర్చలు సఫలం

» ఫీజు బకాయిల్లో రూ.600 కోట్లు వీలైనంత త్వరగా విడుదల చేస్తామన్న ప్రభుత్వం


» మిగతా బకాయిలు భవిష్యత్తులో ఇస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

» అంగీకరించిన కాలేజీల యాజమాన్యాలు.. సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటన

తరువాయి 2లో

# కొన్ని కీలక నిబంధనలపై స్టే

- వక్ఫ్ చట్టాన్ని మొత్తంగా నిలువరించలేమన్న సుప్రీంకోర్టు
- ఇవి మధ్యంతర ఉత్తర్వులేనని వెల్లడి
- తుది విచారణలో పూర్తి వాదనలను వినిపించవచ్చని సూచన
- స్వాగతించిన ముస్లిం సంస్థలు
- ఈకబురు, ఢిల్లీ




రాజ్యాంగబద్ధంగా పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ చట్టాన్ని మొత్తంగా నిలువరించలేమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అయితే అందులోని కొన్ని నిబంధనలపై మాత్రం స్టే ఇస్తున్నామని సోమవారం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. 'వక్ఫ్ సవరణ చట్టం2025లోని అన్ని నిబంధనలపై స్టే ఇవ్వడానికి మాకు ఎటువంటి కారణాలు కనిపించలేదు. అందువల్ల చట్టాన్ని వ్యతిరేకిస్తూ స్టే ఇవ్వాలని చేసిన విజ్ఞప్తులను తిరస్కరిస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ ఆగస్టీన్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం 128 పేజీల ఉత్తర్వుల్లో పేర్కొంది. ఐదేళ్లపాటు ఇస్లాంను అనుసరించినవారే వక్ఫ్‌ను ఏర్పాటుచేయడానికి అనుమతించే నిబంధనపై ధర్మాసనం స్టే ఇచ్చింది. దీంతోపాటు మరికొన్ని కీలక నిబంధనలను నిలిపేస్తూ ఉత్తర్వులిచ్చింది. 'ఎల్లప్పుడూ చట్టం చేసేటప్పుడు రాజ్యాంగబద్ధతకు అనుకూలంగానే ఆలోచనలు సాగుతాయి. అత్యంత అరుదైన కేసుల్లోనే జోక్యం చేసుకోవాల్సి వస్తుంది' అని ధర్మాసనం స్పష్టంచేసింది. ఇవి ప్రాథమికంగా విచారించి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులేనని, చట్టం రాజ్యాంగ బద్ధతపై అటు పిటిషనర్లు, ఇటు ప్రభుత్వం పూర్తి వాదనలను వినిపించడాన్ని ఇవి నిలువరించబోవని పేర్కొంది. చట్టంలోని నిబంధనలపై మధ్యంతర స్టే ఇచ్చేటప్పుడు కోర్టులు నెమ్మదిగా వ్యవహరించాలని సూచించింది. ప్రస్తుత కేసులో పిటిషనర్ల ప్రయోజనాల రక్షణకు, భాగస్వాముల ఈక్విటీలను సమతూకం చేయడానికి కొన్ని నిబంధనలపై స్టే ఇస్తున్నామని తెలిపింది. సుప్రీం కోర్టు ఉత్తర్వులను ముస్లిం సంస్థలు స్వాగతించాయి. కీలక నిబంధనలపై స్టే ఇవ్వడాన్ని స్వాగతిస్తూనే తుది తీర్పులో మొత్తం చట్టాన్ని అత్యున్నత న్యాయస్థానం కొట్టివేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేశాయి.


తరువాయి 2లో

రైల్వే రిజర్వేషన్ విధానంలో మరో కీలక మార్పు.. అక్టోబర్ 1 నుంచి అమల్లోకి » 4లో



అతనితో పెళ్లి.. మరోసారి క్లారిటీ ఇచ్చిన జాన్వీ కపూర్! » 5లో





## దెబ్బకు దిగొచ్చిన ట్రంప్.. విదేశీ ఉద్యోగులను నియమించుకోండంటూ పోస్ట్

తరువాయి 2లో



## నిరసనలను హింసాత్మకంగా మార్చినవారిని శిక్షిస్తాం

తరువాయి 3లో

ప్రమాదకర శక్తులు.. భారీ యుద్ధాలు » 5లో



సాత్విక్ జోడీ టైటిల్ సాధించేనా! » 6లో



## సమ్మక్క సాగర్ ఎన్‌వోసీపై చర్చించేందుకు సమయం ఇవ్వండి

» ఛత్తీస్‌గఢ్ సీఎంకు మంత్రి ఉత్తమ్ లేఖ



ఈకబురు, హైదరాబాద్: గోదావరిపై తెలంగాణ చేపట్టిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం జారీ చేసే విషయమై చర్చించడానికి సమయం ఇవ్వాలంటూ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్‌ని కోరారు. ఈ మేరకు తాజాగా ఆయనకు ఒక లేఖ రాశారు. 'కొత్తగా ఏర్పాటైన తెలంగాణలో నీటి లభ్యతను పెంచేందుకు గోదావరిపై 6.7 టీఎంసీల సామర్థ్యంతో సమ్మక్క సాగర్ బ్యారేజీని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు వెనుక జలాల వల్ల ఛత్తీస్‌గఢ్‌లో కొంత భూభాగం ముంపునకు గురవుతోంది.

తరువాయి 2లో

## వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ



- రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌ఈడీ దీపాలే ఉండాలి
- గ్రామాల్లో నిర్వహణ బాధ్యత సర్పంచ్‌లదే
- ఎంపీడీవోల పర్యవేక్షణలో డ్యాష్‌బోర్డు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

ఈకబురు, హైదరాబాద్, : రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌ఈడీ వీధి దీపాల పర్యవేక్షణ పక్కాగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎల్‌ఈడీ వీధి దీపాలనే ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పంచాయతీరాజ్, పురపాలక శాఖ అధికారులతో సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16లక్షల ఎల్‌ఈడీ దీపాలు ఉన్నాయని, వరంగల్, నల్లగొండ, జనగామ, నారాయణపేట జిల్లాల్లో ఏజెన్సీల ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ దీపాల నిర్వహణ ఉందని అధికారులు వివరించారు. ఇక, జీహెచ్‌ఎంసీ పరిధిలో 5.50లక్షల ఎల్‌ఈడీ వీధి దీపాలున్నాయని, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీలో కొత్తగా 7.50లక్షల దీపాలు అవసరమవుతాయని వెల్లడించారు. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టు ముగియడంతో ఇప్పుడు చాలాచోట్ల దీపాలు వెలగడం లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని నివేదించారు. ఆయా అంశాలపై సీఎం స్పందిస్తూ.. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణను సర్పంచ్‌లకే అప్పగించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న దీపాలు వెలుగుతున్నాయా? లేదా? కొత్తగా ఎన్ని అవసరం? అనే అంచనాలు పక్కాగా ఉండాలని, పోల్ సర్వే చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల డ్యాష్ బోర్డును ఎంపీడీవోలు, జిల్లా స్థాయిలో అడిషనల్ కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు.

తరువాయి2లో

## కాంగ్రెస్ నేతలే యూరియా అమ్ముకుంటున్నారు

» ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు పైసా లేదనడం సిగ్గుచేటు

» జూబ్లీహిల్స్ నుంచే కేసీఆర్ జైత్రయాత్ర మొదలవ్వాలి

» భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్




ఈకబురు, హైదరాబాద్ : రాష్ట్రంలో తీవ్ర యూరియా కొరతకు కాంగ్రెస్ పార్టీనే కారణమని, ఆ పార్టీ నేతలే యూరియాను బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావునగర్ డివిజన్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే గన్‌మన్ యూరియా లారీని ఎత్తుకుపోవడం రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల దోపిడీకి నిలువెత్తు నిదర్శనం. డబ్బులన్నీ ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాలకే ఖర్చు అవుతున్నాయని.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు పైసా లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పడం సిగ్గుచేటు. పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలనలో రూ.20 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాం. ప్రజలపై ప్రేమ ఉంటే ఉపఎన్నిక ప్రచారంలో తిరగకుండా.. వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు మంత్రులు వెళ్లాలి. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తెలంగాణలోని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారు. గులాబీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ ఉపఎన్నికతోనే మొదలుకావాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జూబ్లీహిల్‌స మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత తదితరులు పాల్గొన్నారు.

తరువాయి2లో

## బీడీలతో ముడిపెట్టడం బిహారీలకు

» విపక్ష కూటమికి ప్రజలు ఎన్నికల్లో బదులిస్తారు: మోదీ

» బిహార్‌లో రూ.40 వేల కోట్ల పనుల్ని ప్రారంభించిన ప్రధాని

» 2లో



మొదటి పేజీ తరువాయి

# కొన్ని కీలక నిబంధనలపై స్టే




ప్రస్తుత కేసులో పిటిషనర్ల ప్రయోజనాల రక్షణకు, భాగస్వాముల ఈక్విటీలను సమతూకం చేయడానికి కొన్ని నిబంధనలపై స్టే ఇస్తున్నామని తెలిపింది. సుప్రీం కోర్టు ఉత్తర్వులను ముస్లిం సంస్థలు స్వాగతించాయి. కీలక నిబంధనలపై స్టే ఇవ్వడాన్ని స్వాగతిస్తూనే తుది తీర్పులో మొత్తం చట్టాన్ని అత్యున్నత న్యాయస్థానం కొట్టివేస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేశాయి.

22 మంది సభ్యులున్న సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో నలుగురికి మించి ముస్లిమేతరులు ఉండటానికి వీల్లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. 11 మంది సభ్యులుండే రాష్ట్రాల బోర్డుల్లో ముగ్గురికి మించి ముస్లిమేతరులు ఉండవద్దని ఆదేశించింది. బోర్డు సీఈవో నియామకానికి సంబంధించిన చట్టంలోని సెక్షన్ 23పై ధర్మాసనం స్టే ఇవ్వలేదు. అయితే సాధ్యమైనంత వరకూ ముస్లిం వర్గం నుంచి ఉండే బోర్డు ఎక్స్ అఫీషియో కార్యదర్శినే సీఈవోగా నియమించేందుకు ప్రయత్నించాలని ఆదేశించింది.

చట్టంలోని సెక్షన్ 83 ప్రకారం.. టైటిల్ వివాదాన్ని వక్ఫ్ ట్రైబ్యునల్ పరిష్కరించే వరకూ వక్ఫ్‌లు.. ఆస్తులను తమ స్వాధీనం నుంచి తొలగించడంగానీ, అధికారిక రికార్డుల ఎంట్రీల్లో సవరణలుగానీ చేయకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే ఇది హైకోర్టులో అప్పీలుకు లోబడి ఉంటుందని పేర్కొంది. వివాదం కొనసాగుతున్న సమయంలో థర్డ్ పార్టీ హక్కులను సృష్టించవద్దని ఆదేశించింది.

**సుప్రీం స్టే ఇచ్చిన నిబంధనలు**

చట్టంలోని సెక్షన్ 3(1)(ఆర్) ప్రకారం.. ఐదేళ్లపాటు ఇస్లాంను అనుసరించిన తర్వాతే వక్ఫ్‌ను ఏర్పాటు చేయగలరు. దీనిపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలు నిబంధనలను రూపొందించేవరకూ ఇది అమల్లో ఉంటుంది. ప్రభుత్వాలు రూపొందించే ప్రత్యేక వ్యవస్థ.. వక్ఫ్‌ను ఏర్పాటు చేయడానికి ఐదేళ్లు ఇస్లాంను అనుసరించాలా.. అవసరం లేదా అనే అంశాన్ని నిర్ధారిస్తుంది.

నియమిత అధికారి నివేదిక ఇచ్చే వరకూ ఆస్తులను వక్ఫ్ ఆస్తులుగా పరిగణించకూడదన్న చట్టంలోని నిబంధనపై ధర్మాసనం స్టే ఇచ్చింది.

వక్ఫ్ ఆస్తిని ప్రభుత్వ ఆస్తిగా నియమిత అధికారి ధ్రువీకరిస్తే.. ఆ అధికారే రెవెన్యూ రికార్డుల్లో అవసరమైన సవరణలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని చట్ట నిబంధనల్లో ఉంది. దీనిపైనా ధర్మాసనం స్టే ఇచ్చింది.

వక్ఫ్ ఆస్తుల స్టేటస్‌పై కలెక్టర్‌కు ఇచ్చిన అడ్జుడికేటింగ్ అధికారాలను వినియోగించుకుని బోర్డులోని ముస్లింల ప్రమేయం లేకుండా తీర్పు ఇవ్వడాన్ని ధర్మాసనం నిలిపేసింది.

మొదటి పేజీ తరువాయి

## దెబ్బకు దిగొచ్చిన ట్రంప్.. విదేశీ ఉద్యోగులను నియమించుకోండంటూ పోస్ట్



ఈ-కబురు, హైదరాబాద్ : అమెరికా పరిశ్రమలలో విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యూఎస్‌లో పెట్టుబడుల గురించి తాము ఆలోచిస్తామంటూ దక్షిణకొరియా నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అధ్యక్షుడు దెబ్బకు దిగొచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి అక్రమ వలసల విషయంలో కఠినవైఖరి అవలంబిస్తున్నారు వారిని గుర్తించి, వెనక్కి పంపిస్తున్నారు. ఇందులోభాగంగానే ఇటీవల జార్జియాలో 475 మంది అక్రమ వలసదార్లను నిర్బంధించినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. జార్జియాలో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ కంపెనీ ప్లాంట్‌లో దక్షిణకొరియా వాసులు అక్రమంగా పనిచేస్తున్నారన్న సమాచారం ఆధారంగా ఈ రైడ్ జరిగింది. ఇక్కడ అదుపులోకి తీసుకున్నవారిలో ఆ దేశవాసులే ఎక్కువగా ఉన్నారు ఇది రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ స్పందించారు. "ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యూఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనకాడతాయి" అని హెచ్చరించారు.

**నెతన్యాహూ జాగ్రత్త.. అది మా మిత్ర దేశం: ట్రంప్ వార్నింగ్**

ఈనేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "సంక్లిష్టమైన ఉత్పత్తులను తయారుచేస్తోన్న విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టిన సమయంలో నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం అవుతుంటారు. కొంతకాలం నిపుణులైన కార్మికులను వారు మా దేశానికి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను. వారి నుంచి మన కార్మికులు శిక్షణ పొందాలి. లేకపోతే ఆ భారీ పెట్టుబడుల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. మేం ఆ విదేశీ సంస్థల ఉద్యోగులను స్వాగతిస్తున్నాం. మేం వారినుంచి నేర్చుకొని, వారికంటే మెరుగ్గా రాణిస్తాం" అని ట్రంప్ రాసుకొచ్చారు.

మొదటి పేజీ తరువాయి

# ఫీజు' చర్చలు సఫలం



ఈకబురు, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో సమ్మెకు దిగిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఎట్టకేలకు ఫలప్రదమయ్యాయి. ఇప్పటికే టోకెన్లు విడుదల చేసిన మొత్తంలో రూ.600 కోట్లు వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మిగిలిన బకాయిలను భవిష్యత్తులో చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కాగా సమ్మె విరమిస్తున్నట్టు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేటు కాలేజీలు దాదాపు ఏడాదిగా ఆందోళన చేస్తున్నాయి. గత ఏడాది పరీక్షలు కూడా బహిష్కరిస్తామని హెచ్చరించాయి. అయితే అప్పట్లో అధికారులు నచ్చజెప్పారు. కానీ బకాయిలు విడుదల కాకపోవడంతో తాజాగా సోమవారం నుంచి అన్ని కాలేజీలను బంద్ చేస్తున్నట్టు యాజమాన్యాలు నోటీసు ఇచ్చాయి.

దీంతో ప్రభుత్వం వారిని చర్చలకు ఆహ్వానించింది. ఆదివారం మొదలైన చర్చలు సోమవారం రాత్రి వరకు కొనసాగాయి. తర్జనభర్జనలు, వాదోపవాదాల తర్వాత ఎట్టకేలకు చర్చలు ఫలప్రదంగా ముగిశాయి. అనంతరం మంత్రులు, యాజమాన్య సంఘాల ప్రతినిధులతో కలిసి భట్టి విక్రమార్క విలేకరులతో మాట్లాడారు.

**ఇది మాకెంతో ప్రాధాన్యతాంశం: డిప్యూటీ సీఎం**

ఫీజు రీయింబర్స్‌మెంట్ కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యధిక ప్రాధాన్యత కలిగిన అంశమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. పేద వర్గాల విద్యకు చేయూతనిచ్చే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని, దీన్ని తాము కొనసాగిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని ఛిన్నాభిన్నం చేసిందని, బకాయిలు చెల్లించలేదని విమర్శించారు.

వారు వారసత్వంగా ఇచ్చిన బకాయిలు తమకు భారంగా మారాయన్నారు. అయితే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాలేజీల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపామని, చర్చలు సానుకూలంగా ముగిశాయని తెలిపారు. ప్రభుత్వానికి సహకరించి సమ్మె విరమించిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

కాలేజీల యాజమాన్యాలతో సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను హేతుబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తోందని, దీన్ని పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఓ కమిటీని వేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించామని, త్వరలోనే ఆదేశాలు వెలువడతాయని వెల్లడించారు. హేతుబద్ధీకరణలో యాజమాన్యాలు, మేధావుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.

**డిగ్రీ, పీజీ కాలేజీల అసంతృప్తి!**

చర్చలపై ఇంజనీరింగ్ కాలేజీలు సంతృప్తి వ్యక్తం చేస్తే పీజీ, డిగ్రీ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు మాత్రం అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. మీడియా సమావేశానికి కూడా వారు దూరంగా ఉన్నారు. తమ బకాయిల విషయంలో ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వలేదని, కాలేజీలు నడపాలా? సమ్మెకు వెళ్లాలా? అనే దానిపై మంగళవారం నిర్ణయం తీసుకుంటామని ఆయా కాలేజీల ప్రతినిధులు తెలిపారు. చర్చల్లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డితో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ

ఈకబురు, హైదరాబాద్, : రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌ఈడీ వీధి దీపాల పర్యవేక్షణ పక్కాగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎల్‌ఈడీ వీధి దీపాలనే ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పంచాయతీరాజ్, పురపాలకశాఖ అధికారులతో సోమవారం సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16లక్షల ఎల్‌ఈడీ దీపాలు ఉన్నాయని, వరంగల్, నల్లగొండ, జనగామ, నారాయణపేట జిల్లాల్లో ఏజెన్సీల ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ దీపాల నిర్వహణ ఉందని అధికారులు వివరించారు. ఇక, జీహెచ్‌ఎంసీ పరిధిలో 5.50లక్షల ఎల్‌ఈడీ వీధి దీపాలున్నాయని, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీలో కొత్తగా 7.50లక్షల దీపాలు అవసరమవుతాయని వెల్లడించారు. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టు ముగియడంతో ఇప్పుడు చాలాచోట్ల దీపాలు వెలగడం లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని నివేదించారు. ఆయా అంశాలపై సీఎం స్పందిస్తూ.. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణను సర్పంచ్‌లకే అప్పగించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న దీపాలు వెలుగుతున్నాయా? లేదా? కొత్తగా ఎన్ని అవసరం? అనే అంచనాలు పక్కాగా ఉండాలని, పోల్ సర్వే చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల డ్యాష్‌బోర్డును ఎంపీడీవోలు, జిల్లా స్థాయిలో అడిషనల్ కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ఎల్‌ఈడీ దీపాలను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయానికి అనుసంధానం చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీలో కొత్తగా కలిపిన కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, గ్రామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఎల్‌ఈడీ దీపాల అవసరాన్ని అంచనా వేయాలని ఆదేశించారు. కొత్తగా ఎల్‌ఈడీ దీపాల ఏర్పాటుకు టెండర్లు పిలవాలని, ఎల్‌ఈడీ దీపాల తయారీలో పేరున్న సంస్థలు పాల్గొనేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. ఏడేళ్లపాటు నిర్వహణ బాధ్యతలను కంపెనీలకే అప్పగించాలని, నిర్వహణ పక్కాగా ఉండేలా టెండర్ నిబంధనలు రూపొందించుకోవాలన్నారు. ఎల్‌ఈడీ దీపాలు పని చేస్తున్నాయా? లేదా? అనేది తెలుసుకోవడానికి ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలని నిర్దేశించారు. ఐఐటీ హైదరాబాద్ వంటి సంస్థతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.8 కోట్ల కరెంటు బిల్లులు చెల్లించాల్సి వస్తోందని, దీన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. సౌర విద్యుత్తును వినియోగించే అంశాన్ని పరిశీలించాలన్నారు.



# సమ్మక్క సాగర్ ఎన్‌వోసీపై చర్చించేందుకు సమయం ఇవ్వండి



ఈకబురు, హైదరాబాద్: గోదావరిపై తెలంగాణ చేపట్టిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం జారీ చేసే విషయమై చర్చించడానికి సమయం ఇవ్వాలంటూ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్‌ని కోరారు. ఈ మేరకు తాజాగా ఆయనకు ఒక లేఖ రాశారు. 'కొత్తగా ఏర్పాటైన తెలంగాణలో నీటి లభ్యతను పెంచేందుకు గోదావరిపై 6.7 టీఎంసీల సామర్థ్యంతో సమ్మక్క సాగర్ బ్యారేజీని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు వెనుక జలాల వల్ల ఛత్తీస్‌గఢ్‌లో కొంత భూభాగం ముంపునకు గురవుతోంది. ముంపు ప్రాంతంలో భూసేకరణ, పరిహారం చెల్లించే విషయంపై ఇప్పటికే మీ ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహించాం. ఈ విషయమై మీ రాష్ట్రం ఎన్‌వోసీ జారీ చేయాల్సి ఉంది. మీ సహకారం ఎంతో అవసరం. మీ రాష్ట్రంలో ఏర్పడుతున్న ముంపునకు పునరావాస చర్యలు, భూ సేకరణ పరిహారం చెల్లింపునకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ అంశాలపై మీతో చర్చించడానికి మంగళవారం లేదా ఈ నెల 19వ తేదీన మాకు సమయం ఇవ్వగలరు' అని మంత్రి లేఖలో విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ నేతలే యూరియా అమ్ముకుంటున్నారు



డబ్బులన్నీ ఉద్యోగుల జీతాలు, సంక్షేమ పథకాలకే ఖర్చు అవుతున్నాయని.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు పైసా లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పడం సిగ్గుచేటు. పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలనలో రూ.20 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాం. ప్రజలపై ప్రేమ ఉంటే ఉపఎన్నిక ప్రచారంలో తిరగకుండా.. వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు మంత్రులు వెళ్లాలి. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని తెలంగాణలోని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారు. గులాబీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ ఉపఎన్నికతోనే మొదలుకావాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత తదితరులు పాల్గొన్నారు.

**వైద్యవిద్య ప్రవేశాల్లో రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం**

స్థానికతపై తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీవో వల్ల రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని కేటీఆర్ అన్నారు. మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలో అర్హత సాధించినప్పటికీ ప్రవేశాలకు అనర్హులుగా మిగిలిపోతున్నామని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన్ను కలిసి ఆవేదన వెలిబుచ్చారు. 'పదో తరగతి వరకు తెలంగాణలో చదివి.. శిక్షణ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాం. ఇప్పుడు మమ్మల్ని అనర్హులుగా ప్రకటించి ప్రవేశాలు ఇవ్వడం లేదు' అని వివరించారు. వెంటనే కేటీఆర్ సీఎస్‌తో ఫోన్‌లో మాట్లాడి.. సమస్యను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

## బీడీలతో ముడిపెట్టడం బిహారీలకు అవమానం



ఈ-కబురు, పూర్ణియా: బిహార్ ప్రజలను బీడీలతో పోల్చడం ద్వారా వారిని అవమానించాలని విపక్ష కాంగ్రెస్ చూసిందని, దానికిగానూ రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి పక్షాలకు ప్రజలు తగిన బదులివ్వడం ఖాయమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. బిహార్‌లో రూ.40 వేల కోట్ల అభివృద్ధి పనులకు సోమవారం ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పూర్ణియాలో బహిరంగ సభలో ప్రసంగించారు. పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీ గురించి కేరళ కాంగ్రెస్ నేతలు సామాజిక మాధ్యమంలో వ్యాఖ్యలు చేసి, తర్వాత తొలగించడాన్ని మోదీ ప్రస్తావించారు. "బీడీ, బిహార్ అనే పదాలు రెండూ బీ అనే అక్షరంతో మొదలవుతాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ రాష్ట్రానికి, ఇక్కడి ప్రజలకు ఇది తీరని అవమానం. గతంలో ఆర్జేడీ-కాంగ్రెస్ ఇక్కడ దుష్పరిపాలన సాగించాయి. ఓట్ల కోసం రాష్ట్రంలో విదేశీ చొరబాటుదారులకు కొమ్ముకాశాయి. బిహార్‌తో పాటు అస్సాం, బెంగాల్‌లలోనూ జనాభాపరమైన మార్పులకు అవి కారణమయ్యాయి. ఆర్జేడీ-కాంగ్రెస్ నేతలకు వాళ్ల కుటుంబాలే ముఖ్యం. నేను మాత్రం సబ్‌కా సాథ్.. సబ్‌కా విశ్వాస్ అని నమ్ముతాను" అని ప్రధాని వివరించారు. ప్రభుత్వం పంపే రూపాయిలో 15 పైసలే పేదలకు చేరేవని కాంగ్రెస్ ప్రధాని ఒకరు అంగీకరించారని, మిగిలిన 85 పైసలను.. 'లాంతరు పట్టుకున్న హస్తం' మింగేసేదని కాంగ్రెస్, ఆర్జేడీలను విమర్శించారు.

బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. తాను కొద్దిరోజులపాటు ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమిలో ఉన్నందుకు విచారిస్తున్నానని, ఇకపై ఎప్పటికీ ఎన్డీయేలోనే కొనసాగుతానని ప్రధానికి చెప్పారు.

# ఎర్రకోటకు నల్లచారలు



ఈ-కబురు, దిల్లీ: దేశ సార్వభౌమాధికారానికి ప్రతీకగా నిలుస్తున్న ప్రాచీన కట్టడం ఎర్రకోట. అయితే రాజధాని దిల్లీలో రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో ఎర్రకోట క్రమంగా దెబ్బతింటోందని ఇటీవలి అధ్యయనం వెల్లడించింది. 17వ శతాబ్దంలో షాజహాన్ చక్రవర్తి ఎర్రటి రాతితో నిర్మించిన ఈ కట్టడం గోడలపై నల్లటి కాలుష్య చారలు ఏర్పడుతున్నాయి. భారత్-ఇటలీ దేశాల మధ్య సహకారంలో భాగంగా ఈ అధ్యయనం నిర్వహించారు. ఐఐటీ రూర్కీ, ఐఐటీ కాన్పూర్, వెనిస్‌కు చెందిన సా ఫోస్కారీ, ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) లకు చెందిన శాస్త్రవేత్తల బృందం ఇందులో పాల్గొంది. కాలుష్యం కారణంగా చారిత్రక కట్టడం సౌందర్యం, నిర్మాణం దెబ్బతింటున్నాయని అధ్యయన నివేదిక తెలిపింది. ఈ బృందం ఎర్రకోటలోని వివిధ చోట్ల అంటిన నల్ల మరకల నమూనాలను సేకరించింది. కోట గోడలకు 0.05 మిల్లీమీటర్ల నుంచి 0.5 మిల్లీమీటర్ల మందంతో చారలు ఏర్పడినట్లు వెల్లడించింది. ఈ చారలు కోట గోడ నుంచి పెళ్లలు రాలిపోయేందుకు కారణమవుతున్నాయి. గోడపై అందంగా చెక్కిన శిల్పాలకూ దీనితో ముప్పు వాటిల్లుతోంది. ఒకప్పుడు యమునా నది తీరానికి అతి సమీపంలో ఠీవిగా నిలబడిన ఎర్రకోట నేడు ట్రాఫిక్ రద్దీ మధ్య పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం కారణంగా దీన స్థితికి చేరుతోంది.

# సవాళ్లకు తగ్గట్టు సన్నద్ధం



ఈకబురు, పూర్ణియా:కోల్‌కతా: రక్షణ రంగంలో మరింత స్వయంసమృద్ధి సాధించి, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా నవకల్పనలతో సన్నద్ధం కావాలని దేశ రక్షణ బలగాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్ర ముష్కరుల పీచమణచడానికి చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో సాయుధ దళాల పాత్ర స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భారత సాయుధ దళాలు 2047 నాటికి సాధించాల్సిన లక్ష్యాలపై దార్శనిక పత్రం ఆవిష్కరించారు. సోమవారం కోల్‌కతాలో తూర్పు సైనికదళం ప్రధాన కార్యాలయంలో 16వ ఉమ్మడి కమాండర్ల సదస్సు (సీసీసీ)ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. గత రెండేళ్లలో అమలైన సంస్కరణలు, తదుపరి రెండేళ్ల ప్రణాళికను సమీక్షించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మారిన పరిస్థితులకు అనుగుణంగా బలగాలు ఎలాంటి సన్నద్ధతతో ఉన్నాయనేది అధికారులు ఆయనకు వివరించారు. జాతి నిర్మాణం, సముద్రపు దొంగల్ని ఎదుర్కోవడం, కల్లోలిత దేశాల నుంచి భారతీయుల్ని సురక్షితంగా తీసుకురావడం, స్నేహపూరిత దేశాలకు అవసరమైనప్పుడు మానవతాసాయం అందించడం వంటివాటిలో సైనిక బలగాలు సమన్వయంలో పోషిస్తున్న పాత్రను మోదీ కొనియాడారు. సంస్కరణల సంవత్సరంగా 2025 నిలిచిపోతుందన్నారు. ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు తయారుగా ఉండాలని చెప్పారు.

**మూడురోజులపాటు మేధోమథనం**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రత సలహాదారుడు అజీత్ దోభాల్, త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ తదితరులు సదస్సులో పాల్గొన్నారు. రెండేళ్లకోసారి ఈ తరహా సదస్సును మూడురోజులపాటు నిర్వహిస్తుంటారు. సైనిక, పౌర నాయకత్వాలు ఒకచోట కూర్చొని మేధోమథనం జరిపి, పరస్పరం అభిప్రాయాలు పంచుకుని.. భవిష్యత్ పరిణామాలను ధీటుగా ఎదుర్కొనేలా రంగం సిద్ధం చేయడం దీని లక్ష్యమని రక్షణశాఖ తెలిపింది. ప్రపంచవ్యాప్త అనిశ్చితి పరిస్థితుల్లో వ్యూహాత్మకంగా ఎలా ముందుకు వెళ్లాలి, ఆధునికీకరణ ఎలా ఉండాలి, వేర్వేరు రంగాల్లో యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు ఎలాంటి సన్నద్ధతతో ఉండాలి అనేవి ఈసారి చర్చిస్తారు. కోల్‌కతా సదస్సు నుంచి మోదీ బిహార్‌కు వెళ్లారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: మంత్రి పొంగులేటి



ఈ-కబురు,, హైదరాబాద్: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలు, ప్రత్యేక వెబ్‌సైట్‌ను వెంటనే రూపొందించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, సీపీఆర్‌వో మల్సూర్‌లతో కలిసి జర్నలిస్టుల అక్రిడిటేషన్, హెల్త్ పాలసీ తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. "జర్నలిస్టులపై దాడుల నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. హైపవర్ కమిటీని పునరుద్ధరించాలి. జర్నలిస్టుల జీతభత్యాలకు సంబంధించిన త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్ధరిస్తాం. హెల్త్ పాలసీపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలి" అని పొంగులేటి పేర్కొన్నారు. జర్నలిస్టుల అవార్డులను పునరుద్ధరించాలని శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేయగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్, కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్ లెక్క తప్పిన వేళ.



టెల్అవీవ్: తమ దేశానికి ప్రమాదకరంగా భావించే వ్యక్తులను లక్ష్యం చేసుకోవడం ఇజ్రాయెల్‌కు కొత్తేమీ కాదు. ఎంత కట్టుదిట్టమైన భద్రత మధ్య శత్రువున్నా అంతమొందించగల సత్తా ఆ దేశ నిఘా విభాగం మొస్సాద్ సొంతం. అలాంటిది ఖతార్ రాజధాని దోహాలోని హమాస్ నాయకులపై ఇటీవల చేసిన దాడి ఎందుకు విఫలమైంది? ఇజ్రాయెల్ లెక్క ఎక్కడ తప్పింది? హమాస్ నాయకులను వేటాడటంలో ముందుండే మొస్సాద్.. దోహా ఆపరేషన్‌ను ఎందుకు తీవ్రంగా వ్యతిరేకించింది?.. ఇవన్నీ చర్చకు తెరతీశాయి.

**సొంత భద్రతాదళాల వ్యతిరేకత!**

ఖతార్ రాజధాని దోహాపై మంగళవారం ఇజ్రాయెల్ చేసిన దాడిలో హమాస్ కీలక నేతలు తప్పించుకున్నారు. అయితే ఈ ఆపరేషన్‌ను ఇజ్రాయెల్ భద్రతా సంస్థలే తీవ్రంగా వ్యతిరేకించాయని 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక తెలిపింది. ముఖ్యంగా నిఘా సంస్థ మొస్సాద్.. దాడికి అభ్యంతరం తెలిపినట్లు పేర్కొంది. మొస్సాదే కాదు.. ఐడీఎఫ్ చీఫ్ ఇయాల్ జామిర్, జాతీయ భద్రతా సలహాదారుడు జాకీ హనెగ్‌బీ కూడా దోహా ఆపరేషన్‌ను వ్యతిరేకించారు. హమాస్‌తో జరుగుతున్న చర్చల్లో ఇజ్రాయెల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నీట్ జాన్ లోన్‌ను కూడా చర్చలకు ఆహ్వానించలేదు. ఆపరేషన్‌ను ఆయన వ్యతిరేకిస్తారన్న భయమే ఇందుకు కారణమని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

**ఎందుకు వ్యతిరేకించారంటే..**

దోహా ఆపరేషన్ నిర్వహిస్తే.. గాజా యుద్ధం ముగించడానికి జరుగుతున్న శాంతి చర్చలు విఫలమవడమే కాకుండా, ఖతార్‌తో తమ సంస్థకున్న కీలక సంబంధాలు దెబ్బతింటాయని మొస్సాద్ చీఫ్ డేవిడ్ బార్నే భావించారు. అందుకే దాడి ప్రతిపాదనను ఆయన వ్యతిరేకించారు. అంతేకాదు.. శాంతి చర్చలు జరుగుతున్న సమయంలో హమాస్ నేతలను చంపాలన్న నిర్ణయాన్ని కూడా ఆయన ప్రశ్నించినట్లు 'వాషింగ్టన్ పత్రిక' తన కథనంలో తెలిపింది. ''మూడు నాలుగేళ్లలో వాళ్లను ఎలాగైనా అంతమొందిస్తాం. వారిని హతమార్చడం ఎలాగో మొస్సాద్‌కు తెలుసు'' అని బార్నే తెలిపినట్లు పేర్కొంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇజ్రాయెల్ గగనతల దాడిని ఎంచుకోవాల్సి వచ్చింది. చివరకు వాయుసేన.. అంతర్గత భద్రతా సంస్థ 'షిన్‌బెట్'తో కలిసి ఈ ఆపరేషన్‌ను నిర్వహించాల్సి వచ్చింది.

**అమెరికాకు సమాచారం ఇవ్వలేదు**

సౌదీ గగనతలంలోకి ప్రవేశించకుండా ఎర్రసముద్రం నుంచే ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించాయని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ఆ పత్రిక కథనం ప్రకారం ఈ ఆపరేషన్‌లో ఎనిమిది ఎఫ్15లు, నాలుగు ఎఫ్35లు పాల్గొన్నాయి. అమెరికా ఎక్కడ అభ్యంతరం చెబుతుందోనని ఈ ఆపరేషన్ గురించి ఆఖరి నిమిషం వరకు ఆ దేశానికి ఇజ్రాయెల్ చెప్పలేదు. తమకు సమాచారం అందిన సమయానికే క్షిపణులు లక్ష్యాన్ని తాకాయని అమెరికా రక్షణ అధికారి ఒకరు తెలిపారు.

**అసలు ఆ భవనంలో ఉన్నారా?**

దాడిలో హమాస్ నాయకులెవ్వరూ చనిపోలేదని ఇజ్రాయెల్ భద్రతాధికారులు నిర్ధరించారు. అసలు ఆ నాయకులు తాము దాడిచేసిన భవనంలో ఉన్నారా లేరా అన్నది అనుమానమేనని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఆ భవనంలోనే మరో భాగంలో హమాస్ నేతలు ఉన్నారని కూడా కథనాలు వస్తున్నాయి. సాధారణ పౌరులకు ఏమైనా జరిగితే ఖతార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతుందన్న భయం కూడా దాడి తీవ్రత తగ్గడానికి కారణమని 'వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనం తెలిపింది. భవనంలోని కొన్ని గదులను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. ఒకరిద్దరు కీలక హమాస్ నాయకులు గాయపడ్డారని.. అందులో అల్‌హయ్యా ఉన్నారని ఇజ్రాయెల్ అనుమానిస్తోంది.

# పెన్షన్‌కు సర్వీస్ బ్రేక్ అడ్డంకి కాదు

**ఏపీ విభజన ఉద్యోగుల కేసులో సుప్రీంకోర్టు తీర్పు**

**వారి సర్వీసును నిరంతరంగానే భావించాలని స్పష్టీకరణ**

ఆ ఖాళీ కాలానికి పూర్తి జీతం చెల్లించాలన్న ఉద్యోగుల పిటిషన్ మాత్రం కొట్టివేత

ఈకబురు, దిల్లీ: రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు సుప్రీంకోర్టులో పాక్షిక ఊరట లభించింది. ఉద్యోగంలో చేరడంలో పరిపాలన పరంగా జరిగిన జాప్యం వల్ల ఏర్పడిన సర్వీస్ అంతరాయాన్ని(సర్వీస్ బ్రేక్) పెన్షన్ ప్రయోజనాల కోసం పరిగణనలోకి తీసుకోవాలని, వారి సర్వీసును నిరంతరంగానే భావించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పనిచేయని ఆ కాలానికి కూడా పూర్తి జీతం చెల్లించాలన్న ఉద్యోగుల అభ్యర్థనను మాత్రం తోసిపుచ్చింది. 'నో వర్క్-నో పే' అనే సూత్రం వర్తిస్తుందని తేల్చిచెబుతూ వారి పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టిలతో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది.

**పనిచేయని కాలానికి జీతం ఇవ్వాలనే నిబంధన లేదు..**

2014లో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో 58 ఏళ్లకు పదవీ విరమణ చేసిన కొందరు ఉద్యోగులను.. ఏపీలో 60 ఏళ్ల పదవీ విరమణ వయసు ఉన్నందున తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. అయితే, తెలంగాణ నుంచి రిలీవ్ అవ్వడానికి, ఏపీలో పోస్టింగ్ ఇవ్వడానికి మధ్య.. కొన్ని నెలల నుంచి ఏడాదికి పైగా సమయం పట్టింది. ఈ కాలాన్ని సర్వీసుగా పరిగణించి పూర్తి జీతం చెల్లించాలని ఉద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. పనిచేయని కాలానికి కూడా జీతం చెల్లించడానికి చట్టంలో ఎలాంటి నిబంధన లేదని.. అందువల్ల ఆ డిమాండ్‌కు చట్టపరమైన బలం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఉద్యోగుల తప్పు లేకుండా జరిగిన పరిపాలన జాప్యం వల్ల.. వారి పెన్షన్ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకూడదని అభిప్రాయపడింది. ఆ ఖాళీ సమయాన్ని కూడా పెన్షన్ లెక్కింపు కోసం పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. తద్వారా వారి 60 ఏళ్ల సర్వీస్‌కు గాను పూర్తి పెన్షన్ ప్రయోజనాలు పొందుతారని పేర్కొంది. అయితే ఈ ప్రయోజనం పొందాలంటే.. తాము పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆ ఖాళీ సమయంలో ఉద్యోగులు ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చి ఉండాలని కోర్టు వ్యాఖ్యానించింది.




# నిరసనలను హింసాత్మకంగా మార్చినవారిని శిక్షిస్తాం



**నేపాల్ తాత్కాలిక ప్రధాని కార్కీ**

ఈకబురు,కార్‌మాండూ: నేపాల్‌లో గతవారం జరిగిన ప్రభుత్వ వ్యతిరేక నిరసనల్లో దేశవ్యాప్తంగా హింసను ప్రేరేపించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తాత్కాలిక ప్రధాని సుశీలా కార్కీ ప్రకటించారు. ఆదివారం ఆమె రాజధాని కార్‌మాండూలోని సింగాదర్బార్ కార్యాలయంలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యదర్శులు, సీనియర్ అధికారులు హాజరైన సమావేశంలో మాట్లాడుతూ.. ఆందోళనల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేసి హింసకు పాల్పడిన వారిని కచ్చితంగా శిక్షిస్తామని ప్రకటించారు. సెప్టెంబరు 9 నిరసనల సందర్భంగా జరిగిన హింస పక్కా ప్రణాళికతో జరిగిందని, ఇందులో జెన్‌జడ్ పాల్గొనలేదని అన్నారు. మరోవైపు నిరసనల్లో మృతిచెందిన వారిని 'అమరవీరులు'గా ప్రకటిస్తున్నామని, వారి కుటుంబాలకు ఒక మిలియన్ (నేపాలీ రూపాయి)ని అందిస్తామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా ధ్వంసమైన పోలీసు పోస్టులను మరమ్మత్తు చేయాలని ప్రధాన కార్యదర్శి ఏక్ నారాయన్ అరియాల్‌ను కార్కీ ఆదేశించారు. నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీలా కార్కీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది.

# భారత ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేసే ఏఐ




## జీడీపీకి అదనంగా రూ.52 లక్షల కోట్లు 2035 కల్లా సాధ్యం: నీతి ఆయోగ్ నివేదిక

అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధ(ఏఐ)ను అంది పుచ్చుకోవడం పెరుగుతున్నందున 2035 కల్లా భారత జీడీపీకి అదనంగా 500600 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.4452 లక్షల కోట్లు) మేర జత అవుతుందని నీతి ఆయోగ్ నివేదిక అంచనా వేస్తోంది. ఏఐ వల్ల ఉత్పాదకత, సిబ్బంది సామర్థ్యం పెరగడం ఇందుకు దోహదం చేస్తుందని అభిప్రాయపడింది. వచ్చే పదేళ్లలో ఏఐ అన్ని విభాగాల్లోనూ దూసుకెళ్లడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 1726 లక్షల కోట్ల డాలర్లు (దాదాపు రూ.1496 2288 లక్షల కోట్లు) అదనంగా చేరతాయని అంచనా వేసింది.

క్లరికల్ ఉద్యోగాలు మాయం?: అంతర్జాతీయ ఏఐ విలువలో భారత్ 1015% వాటాను అందిపుచ్చుకునేందుకు అవకాశాలున్నాయి. ఏఐ వల్ల పలు కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. అయితే క్లరికల్, సాధారణ, తక్కువ నైపుణ్యం ఉండే విభాగాలు మాయం కావొచ్చు. ఆర్థిక సేవలు, తయారీపై ఏఐ ప్రభావం ఎక్కువగా ఉంది. జీడీపీలో ఇవి 20 25% వాటాను అందుకోవచ్చు. ఏఐ కారణంగా ఆర్థిక సేవలు 5055 బిలియన్ డాలర్ల విలువకు చేరుకోవచ్చు. ప్రస్తుత అంచనా (2035పై) కంటే ఇది అధికం.

తయారీ విషయానికొస్తే ఏఐ ఆధారిత ఉత్పాదకత, సామర్థ్యం పెరగడం వల్ల 85100 బి. డాలర్ల మేర జత కావొచ్చు.

జీడీపీ 8.3 లక్షల కోట్ల డాలర్లకు?: ప్రస్తుత 5.7% వృద్ధి రేటుతో లెక్కవేస్తే 2035 కల్లా 6.6 లక్షల కోట్ల డాలర్లకు భారత జీడీపీ చేరొచ్చు. అదే 8% వృద్ధి అయితే 8.3 లక్షల కోట్ల డాలర్లకు చేరే అవకాశం ఉంది.టెక్ వినూత్నతలకు అనుగుణంగా నియమావళి.. సీతారామన్: అందరికీ మంచి చేసే వినూత్నతలు.. ముఖ్యంగా ఏఐలో అవి వచ్చినపుడు వాటిని ఇబ్బంది పెట్టకుండా నియమావళి ఉండాలి. వాటికి మద్దతునిచ్చే నిబంధనలు ఉండాలని నీతి ఆయోగ్ రూపొందించిన ఈ నివేదికను విడుదల చేస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. ఏఐ ని అందిపుచ్చుకుని, ఒక గొప్ప ప్రభావం చూపడానికి భారత్‌కు మంచి అవకాశం ఉందని టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పరిశ్రమకు సూచించారు.

# ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఆశలు!



దిల్లీ: భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చల్లో మళ్లీ కదలిక వస్తోంది. ఈ ఒప్పందంపై చర్చించేందుకు అమెరికా ప్రతినిధి బ్రెండెన్ లించ్ సోమవారం రాత్రి భారత్‌కు విచ్చేశారు. భారత వస్తువులపై 50% సుంకాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన తర్వాత, ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పంద చర్చల్లో అనిశ్చితి నెలకొన్న సంగతి తెలిసిందే. తదుపరి భారత ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నానంటూ ట్రంప్ పోస్ట్ పెట్టగా.. తాను కూడా అమెరికా అధ్యక్షుడితో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నానని మన ప్రధాని నరేంద్ర మోదీ బదులిచ్చారు. ఈ నేపథ్యంలో యూఎస్ ప్రతినిధి భారత్ పర్యటనకు రావడం గమనార్హం. ఇప్పటివరకు భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు 5 దఫాలుగా చర్చించారు. ఆరో విడత చర్చల కోసం ఆగస్టు 25న యూఎస్ బృందం భారత్‌కు వస్తుందని భావించారు. కానీ ట్రంప్ సుంకాలు ప్రకటించడంతో, ఆ పర్యటన కాస్తా రద్దయింది. అమెరికా ప్రతినిధి బ్రెండెన్ లించ్‌తో మంగళవారం జరిపే చర్చలను ఆరో విడత చర్చలుగా చూడకూడదని ఇండియా ప్రతినిధి, వాణిజ్య మంత్రిత్వ శాఖలోని ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. ఈ సమావేశం కేవలం భవిష్యత్ కార్యాచరణనే నిర్దేశిస్తుందని తెలిపారు.

# మారుతీ విక్టోరిస్ రూ.10.5 లక్షలు




జయపుర: మారుతీ సుజుకీ మధ్య స్థాయి ఎస్‌యూవీ విభాగంలో 'విక్టోరిస్'ను ఆవిష్కరించింది. దీని పరిచయ ధర రూ.10.519.99 లక్షలని సంస్థ తెలిపింది. జెన్‌జడ్ వినియోగదార్లను ఆకట్టుకునేలా దీన్ని తీసుకొచ్చినట్లు మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, విక్రయాలు) పార్థో బెనర్జీ పేర్కొన్నారు. విక్టోరిస్ అమ్మకాలు ఈనెల 22న ప్రారంభమవుతాయని కంపెనీ తెలిపింది. మొత్తం 21 వేరియంట్లలో వస్తున్న ఈ మోడల్ స్ట్రాంగ్ హైబ్రిడ్, సీఎన్‌జీ, స్మార్ట్ హైబ్రిడ్‌లలో లభ్యం కానుంది.

# రూ.19.99 లక్షల బీఎండబ్ల్యూ బైక్

దిల్లీ: బీఎండబ్ల్యూ మోటోరాడ్ ఇండియా కొత్త ఎస్ 1000 ఆర్ బైక్‌ను విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ బైక్ ధర రూ.19.90 లక్షలు (ఎక్స్-షోరూమ్). 999 సీసీ, ఇంజిన్ సామర్థ్యంతో రూపొందించిన ఈ బైక్ 0-100 కి.మీ. వేగాన్ని 3.2 సెకన్లలోనే అందుకుంటుందని కంపెనీ తెలిపింది. గంటకు 250 కి.మీ. వేగంతో ప్రయాణించొచ్చని పేర్కొంది.

ఆధునిక సాంకేతికత, ఎక్స్‌టెన్సివ్ వారెంటీ, రోడ్‌సైడ్ అసిస్టెన్స్, ప్రత్యేక రోడ్‌స్టర్ డిజైన్, స్ప్లిట్‌ఫేస్ ఎల్ఈడీ హెడ్‌లైట్, షార్ప్ బాడీ లైన్స్, మినిమలిస్ట్ నేకెడ్‌బైక్ ప్రపోర్షన్స్ ఈ బైక్‌లో ఉన్నాయి. 6.5 అంగుళాల ఫుల్-కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే విత్ స్మార్ట్ కనెక్టివిటీ, యూఎస్‌బీ ఛార్జింగ్ సాకెట్ వంటి అదనపు ప్రత్యేకతలు కూడా ఉన్నాయి.



# సెస్‌ల లక్ష్యం నీరుగారుతోందా?

కేంద్రం సెప్టెంబర్ 22 నుంచి కొత్త జీఎస్టీ శ్లాబులను అమలు చేస్తున్న నేపథ్యంలో సెస్‌లను సవ్యంగా ఉపయోగించుకోవడం పట్ల ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సెస్‌లు.. నిర్దిష్ట ప్రయోజనాల కోసం ప్రభుత్వం విధించే అదనపు పన్నులు. అయితే వీటి వినియోగంపై పారదర్శకత చాలా కాలంగా చర్చకు దారితీస్తోంది. విద్య, ఆరోగ్యం లేదా మౌలిక సదుపాయాలు వంటి ప్రజా సంక్షేమం కోసం నిధులకు ఉద్దేశించినవే ఈ సెస్‌లు. చాలా సేవలపై ప్రభుత్వం విధిస్తున్న సెస్‌లు వాటికి ఉద్దేశించిన ప్రయోజనాన్ని అందించడంలో విఫలమవుతున్నాయనే వాదనలున్నాయి.

రాష్ట్రాలను పక్కదారి పట్టించే సాధనంగా..

ఇతర పన్నుల మాదిరిగా కాకుండా, ఆదాయశాఖ నియమాల ప్రకారం.. సెస్‌లు, సర్‌ఛార్జీలు రాష్ట్రాలతో పంచుకునేందుకు వీలుండదు. వీటిపై పూర్తి అధికారం కేంద్రానిదే. వాస్తవానికి దశాబ్దాల నుంచి సెస్‌లు వివిధ విభాగాల్లో పెరుగుతూ వస్తున్నాయి. 2018 అధ్యయనం ప్రకారం.. 1944 నుంచి 44 విభిన్న సెస్‌లను గుర్తించారు. 2017లో జీఎస్టీని ప్రారంభించినప్పుడు 26 సెస్‌లను రద్దు చేసి, ఉన్నవాటిలో కొన్నింటి రేట్లను పెంచారు. ఈ సెస్‌ల్లో రాష్ట్రాల ఆదాయ లోటును భర్తీ చేయడానికి సిన్ గూడ్స్, లగ్జరీ వస్తువులపై వసూలు చేసే పరిహార సెస్ (జీసీసీ) ఒక్క దాన్ని మాత్రమే రాష్ట్రాలతో పంచుకుంటున్నారు.

పర్యవేక్షణ కరవు..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 270, 271 సెస్‌లను



ప్రస్తావించినప్పటికీ వాటి వినియోగం అస్పష్టంగా ఉంది. సెస్‌ల నుంచి సమకూరే నిధులు కన్సాలిడేటెడ్ ఫండ్‌కు కాకుండా పబ్లిక్ అకౌంట్ ఆఫ్ ఇండియాకు వెళ్తున్నాయి. ఈ యంత్రాంగం ద్వారా సెస్ నిధులను ఆయా విభాగాలు, విద్య, వైద్య, ఇతర మౌలిక సదపాయాలు సృష్టించేందుకు కేటాయించాలి. కానీ బడ్జెట్ పరిశీలనలో వీటి ఊసే ఎత్తడం లేదనే వాదనలున్నాయి.

ఆడిట్ చేయకపోతే అంతే సంగతులు..

కన్సాలిడేటెడ్ ఫండ్ కేటాయింపులతోపాటు పబ్లిక్ అకౌంట్ ఫండ్స్‌పై కఠినమైన పర్యవేక్షణ ఉండదనే అభిప్రాయాలున్నాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆడిట్ చేయకపోతే వీటిపై అసలు రివ్యూనే చేయరని కొందరు భావిస్తున్నారు. ఇటీవల కాగ్ నివేదిక ఈ సమస్యను హైలైట్ చేసింది. 2024 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం సెస్‌లు, సర్‌ఛార్జీల నుంచి రూ.4.88 లక్షల కోట్లు సేకరించింది. ఇది స్థూల పన్ను ఆదాయంలో 14 శాతంగా ఉంది. అయితే ఇందులో రూ.3.57 లక్షల కోట్లు సెస్ ద్వారానే సమకూరింది. అయినప్పటికీ ఈ నిధులను నిబంధనల ప్రకారం ఉద్దేశించిన ప్రయోజనాల కోసం ఉపయోగించారా.. లేదా.. అనే దానిపై పారదర్శకత లోపించిందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. చమురుపై విధిస్తోన్న సెస్ ద్వారా 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.2.95 లక్షల కోట్లు సమకూరింది. అందులో కేవలం రూ.902 కోట్లు మాత్రమే చమురు పరిశ్రమ అభివృద్ధి నిధి (OIDB)కు బదిలీ చేశారు.

# రైల్వే రిజర్వేషన్ విధానంలో మరో కీలక మార్పు.. అక్టోబర్ 1 నుంచి అమల్లోకి



దిల్లీ: రిజర్వేషన్ విధానానికి సంబంధించి రైల్వే బోర్డు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై సాధారణ రిజర్వేషన్ టికెట్లకూ ఆధార్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేసింది. మొదటి 15 నిమిషాలు కేవలం అధార్ వెరిఫైడ్ యూజర్లు మాత్రమే ఐఆర్‌సీటీసీ లేదా అధికారిక యాప్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఇది తత్కాల్ బుకింగ్ విధానంలో అమల్లో ఉంది. అక్టోబర్ 1 నుంచి సాధారణ రిజర్వేషన్లకు కూడా వర్తింపజేస్తున్నట్లు తెలిపింది.

యూపీఐ కొత్త లావాదేవీ పరిమితులు.. రూ.5 లక్షలు ఒకేసారి కట్టేయొచ్చు

ఏదైనా ట్రైన్‌కు ప్రస్తుతం 60 రోజుల ముందే టికెట్ రిజర్వేషన్ చేసుకునేందుకు సౌలభ్యం ఉంది. కానీ, తత్కాల్ టికెట్ల మాదిరిగానే బుకింగ్ ప్రారంభమైన వెంటనే అక్రమార్కులు సాఫ్ట్‌వేర్ సాయంతో టికెట్లను బుక్ చేసేస్తున్నారు. దీంతో సాధారణ ప్రయాణికులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ టికెట్లు పక్కదోవ పట్టకుండా సామాన్య యూజర్‌కు ఆ ప్రయోజనాలు అందాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే బోర్డు పేర్కొంది. ఈ మేరకు అన్ని జోనల్ కార్యాలయాలకు సమాచారం ఇచ్చింది. రైల్వేస్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్ బుకింగ్ సమయాల్లో ఎటువంటి మార్పూ ఉండదు.


# ఆ పరిస్థితులే నిర్మాతగా మార్చాయి






'చిత్రపరిశ్రమలో నాలా ఎవరు ఇబ్బందిపడకూడదనే నిర్మాణ సంస్థను స్థాపించాను'ని అంటోంది అందాల తార ప్రియాంక చోప్రా. త్వరలో అగ్రహీరో మహేశ్ బాబుతో కలిసి తెలుగు ప్రేక్షకుల్ని పలకరించడానికి సిద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలతో నటిగా అలరిస్తూనే.. నిర్మాతగా కూడా రాణిస్తోంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రియాంక.. పర్పుల్ పెబుల్ పిక్చర్స్ పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించడానికి అప్పటి బాలీవుడ్ పరిస్థితులే కారణమని అంటోంది. "2000 సంవత్సరంలో నేను మిస్ వరల్డ్ కిరీటం సొంతం చేసుకున్నా. మంచి అవకాశాల్ని అందుకున్నా. హిందీ, తమిళ సినిమాల్లో నటించడం మొదలుపెట్టా. ఆ తర్వాత రెండేళ్లకు బాలీవుడ్‌లో పరిస్థితులు అర్థమయ్యాయి. సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చిన వారిని ఎంత చులకనగా చూస్తారో తెలుసుకున్నా. తరతరాలుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న వారు పెద్ద స్టార్‌లుగా ఉన్నారు. అలాంటప్పుడు బయట నుంచి వచ్చిన వారు పరిశ్రమలో కొనసాగడం అంత సులభం కాదు. కానీ.. నేను ఎంతో కష్టపడి ఆఫర్లు అందుకొని విజయాలు సాధించాను. ఆ సమయంలోనే సినీ నేపథ్యం లేకుండా కొత్తగా ఇండస్ట్రీకి వచ్చే వాళ్లను ప్రోత్సహించడానికి 2015లో సొంతంగా నిర్మాణ సంస్థను ప్రారంభించాను"ని చెప్పుకొచ్చింది.

## ప్రమాదకర శక్తులు.. భారీ యుద్ధాలు



కథానాయకుడు పవన్ కల్యాణ్ 'ఓజీ' చిత్ర విడుదలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రచార పర్వాన్ని పరుగులు పెట్టిస్తోంది చిత్ర బృందం. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ సినిమా నుంచి ''గన్స్ అండ్ రోజెస్'' అనే ర్యాప్ గీతాన్ని బయటకు వదిలారు. ఓజాస్ గంభీరగా పవన్ పాత్ర చుట్టూ ఉన్న క్రూరమైన ప్రపంచాన్ని.. ప్రమాదకర శక్తుల్ని.. ఈ కథలోని సంఘర్షణను.. భారీ యుద్ధాల్ని ఈ పాటతో పరిచయం చేసే ప్రయత్నం చేశారు. ఈ గీతానికి తమన్ స్వరాలు సమకూర్చగా.. అద్వితీయ సాహిత్యమందించారు. డి హర్ష ఆలపించారు. ఈ భారీ యాక్షన్ డ్రామాకు సంబంధించిన ట్రైలర్ ఈ వారాంతంలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. సుజీత్ తెరకెక్కించిన ఈ సినిమాని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ప్రియాంక మోహన్ కథానాయిక. ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది.

## ఎమ్మీ అవార్డుల్లో 'అడోలెసెన్స్' సత్తా



పిల్లలు ప్రయోజకులవ్వాలని.. విజేతలుగా వెలిగిపోవాలని.. అన్నీ సౌకర్యాలను అందుబాటులో ఉంచుతున్న ఈతరం తల్లిదండ్రులకు మంచి సందేశాన్ని ఇచ్చిన సిరీస్ 'అడోలెసెన్స్'. ఇటీవలే విడుదలై ఎంతో మంది సినీప్రియుల్ని మెప్పించిన ఈ సిరీస్... ఇప్పుడు మరోసారి 77వ ఎమ్మీ పురస్కారాల్లో 5 కేటగిరిల్లో అవార్డులు గెల్చుకొని సత్తా చాటింది. అంతర్జాతీయ సినీపరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ అవార్డుల వేడుక లాస్ ఏంజెలెస్‌లో ఘనంగా జరిగింది. ఇందులో లిమిటెడ్ సిరీస్ విభాగంలో ఉత్తమ సిరీస్‌గా అవార్డును దక్కించుకుంది 'అడోలెసెన్స్'. దీంతో పాటు ఇందులో నటనకు గానూ ఉత్తమ నటుడిగా స్టీఫెన్ గ్రాహం, ఉత్తమ సహాయ నటిగా ఎరిన్ డోహెర్టీ, ఫిలిప్ బారంటిని ఉత్తమ దర్శకుడు పురస్కారాల్ని సొంతం చేసుకున్నారు. ఈ సిరీస్‌లో తన నటనతో మెప్పించిన ఓవెన్ కూపర్ ఉత్తమ సహాయ నటుడిగా అతి చిన్న వయసులోనే ఎమ్మీ అవార్డును సొంతం చేసుకొని రికార్డు సృష్టించాడు. దీంతో పాటు ఉత్తమ డ్రామా సిరీస్‌గా నిలిచిన 'ది పిట్'లోని నటనకుగానూ ఉత్తమ నటుడిగా నోహ్ వైల్, ఉత్తమ నటిగా బ్రిట్నీ లీ లోయర్ (సెవెరెన్స్) పురస్కారాల్నీ సొంతం చేసుకున్నారు. ఉత్తమ కామెడీ సిరీస్‌గా నిలిచిన 'ది స్టూడియో'తో పాటు ఈ వేడుకలో పలు హాలీవుడ్ సిరీస్‌లకు ఎమ్మీ అవార్డులు వరించాయి.

## భద్రకాళి ఎవరినీ నిరుత్సాహపరచదు: విజయ్ ఆంటోనీ



ఇటీవలే 'మార్గన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చిన హీరో విజయ్ ఆంటోనీ ఇప్పుడు 'భద్రకాళి'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. అరుణ్ ప్రభు దర్శకత్వంలో రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. రియా, తృప్తి రవీంద్ర నాయికలు. ఈ చిత్రం ఈనెల 19న విడుదల కానున్న నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ.. ''ఓ విభిన్నమైన రాజకీయ నేపథ్య చిత్రమిది. 'భద్రకాళి' కచ్చితంగా ఎవరినీ నిరుత్సాహపరచదు'' అన్నారు. నిర్మాత సురేశ్‌బాబు మాట్లాడుతూ.. ''ఈ సినిమాని తెలుగులో మేము విడుదల చేయనుండటం సంతోషంగా ఉంది'' అన్నారు.

## సినీ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్ రూపకల్పన



తెలంగాణ రాష్ట్రంలో సినీ రంగాభివృద్ధికి కావాల్సిన అనుమతులన్నీ ఒకే విండో ద్వారా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఫిలిమ్స్ ఇన్ తెలంగాణ' పేరుతో ఓ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తోంది. తెలంగాణలో సినిమా చిత్రీకరణలకు, థియేటర్ల నిర్వహణకు పొందాల్సిన అన్ని అనుమతుల్ని ఈ వెబ్‌సైట్‌తో ఒకే విండో ద్వారా పొందేందుకు ప్రభుత్వం వీలు కల్పించనుంది. ఈ సులభతర అనుమతులపై రూపొందిస్తున్న వెబ్‌సైట్‌పై సోమవారం సంబంధిత శాఖలు, ఫిల్మ్ ఇండస్ట్రీ ప్రతినిధులతో హైదరాబాద్‌లో ప్రత్యేక వర్క్‌షాప్ జరిగింది. దీనికి తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్. ప్రియాంక, టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరు క్రాంతిలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. ''రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రకాలుగా చేయూతనిస్తున్నారు. ఈ సదావకాశాన్ని ఇండస్ట్రీ పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలి. అంతర్జాతీయ స్థాయి సినీ నిర్మాతలు కేవలం స్క్రిప్ట్‌తో వస్తే వారి సినిమా నిర్మాణానికి కావాల్సిన షూటింగ్ లొకేషన్లు, వివిధ శాఖల నుంచి కావాల్సిన అనుమతులు ఈ వెబ్‌సైట్ ద్వారా సులభంగా పొందవచ్చు. అలాగే సినిమా థియేటర్ల నిర్వహణకు కావాల్సిన బీఫామ్ జారీ విధానాన్ని తేలికగా ఆన్‌లైన్ ద్వారా పొందే విధానాన్ని ప్రవేశ పెడుతున్నాం. సినిమా థియేటర్ల నిర్వహణకు ఇప్పటి వరకు నగరాల్లో అయితే సంబంధిత పోలీసు కమిషనర్లు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో అయితే ఆయా జిల్లాల అడిషనల్ కలెక్టర్లు జారీ చేసేవారు. కానీ, ఇకపై ఆ అనుమతులన్నీ ఆన్‌లైన్ ద్వారా జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖతో చర్చించి విధివిధానాలు రూపొందిస్తున్నాం. ఈ వెబ్‌సైట్‌లో సినీ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక విభాగాల టెక్నీషియన్లు, రాష్ట్రంలో వివిధ నగరాల్లో అందుబాటులో ఉన్న హోటళ్లతో పాటు సంపూర్ణ సమాచారం అందుబాటులో ఉంచనున్నాం'' అన్నారు. ఈ వెబ్‌సైట్ రూపకల్పనకు సంబంధించి చిత్ర పరిశ్రమ ప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులు తగు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు. వెబ్‌సైట్‌ను పూర్తి స్థాయిలో రూపొందించాక తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో దాన్ని ప్రారంభిస్తామని తెలియజేశారు.


## అతనితో పెళ్లి.. మరోసారి క్లారిటీ ఇచ్చిన జాన్వీ కపూర్!





ఇటీవలే పరమ్ సుందరితో అభిమానులను అలరించిన బాలీవుడ్ ముద్దుగుమ్మ జాన్వీ కపూర్. అంతలోనే మరో మూవీతో అలరించేందుకు సిద్ధమైంది. సన్నీ సంస్కారి కీ తులసి కుమారి అనే సినిమాలో హీరోయిన్‌గా కనిపించనుంది. వరుణ్ ధావన్ హీరోగా వస్తోన్న ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ఈవెంట్‌కు జాన్వీ కపూర్ కూడా హాజరైంది.ఈ సందర్భంగా జాన్వీ కపూర్‌కు తన పెళ్లి గురించి మరోసారి ప్రశ్న ఎదురైంది. ఈ ప్రశ్నకు జాన్వీ కపూర్ స్పందించారు. ప్రస్తుతానికి తనకైతే పెళ్లి చేసుకునే ఆలోచన లేదని చెప్పింది. ఇప్పుడు నా దృష్టి కేవలం సినిమాలపైనే ఉందని తెలిపింది. వివాహానికి ఇంకా చాలా సమయం ఉందని వెల్లడించింది. దీంతో తనపై వస్తున్న మ్యారేజ్ రూమర్స్‌కు చెక్ పెట్టింది ముద్దుగుమ్మ. అయితే గతంలో ఆమె.. శిఖర్ పహారియాను పెళ్లి చేసుకోనున్నట్లు వార్తలొచ్చాయి. ఎందుకంటే వీరిద్దరు చాలాసార్లు జంటగా కనిపించడంతో రూమర్స్ వినిపించాయి. గత ఇంటర్వ్యూలో తన ఫోన్‌లో స్పీడ్ డయల్ లిస్ట్‌లో బోనీ కపూర్, ఖుషీ కపూర్‌తో పాటు శిఖర్ పేరును కూడా చెప్పడంతో డేటింగ్ రూమర్స్ మొదలయ్యాయి. కాగా.. శిఖర్ పహారియా మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే మనవడు అన్న సంగతి తెలిసిందే. మరోవైపు ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉన్న జాన్వీ కపూర్.. టాలీవుడ్‌లో రామ్ చరణ్ సరసన పెద్దిలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీకి బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది.

# ఇంతకన్నా ఏం కావాలి.




దుబాయ్: పాకిస్థాన్‌పై టీమ్ఇండియా సాధించిన విజయం పట్ల కోచ్ గౌతమ్ గంభీర్ హర్షం వ్యక్తం చేశాడు. పహల్గాం ఉగ్రదాడి బాధితుల కుటుంబాలకు సంఘీభావం తెలిపేందుకు టీమ్ఇండియా ఈ మార్గాన్ని ఎంచుకుందని వ్యాఖ్యానించాడు. ఆదివారం భారత జట్టు ఆదివారం ఏడు వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసిన అనంతరం గంభీర్ స్పందించాడు. “ఇది మంచి విజయం. అంతకన్నా ముఖ్య విషయమేంటంటే.. ఒక జట్టుగా మేం పహల్గాం ఉగ్రదాడి బాధితులకు కుటుంబాలకు సంఘీభావం తెలపాలనుకున్నాం. అలాగే ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సాయుధ దళాలకు కృతజ్ఞతలు తెలపాలనుకున్నాం. దేశం గర్వపడేలా, సంతోష పడేలా చేయడానికి ప్రయత్నిస్తాం” అని చెప్పాడు. పాక్‌తో మ్యాచ్‌లో భారత ఆటగాళ్ల ప్రదర్శనపై గంభీర్ సంతోషం వ్యక్తం చేశాడు. “ఇంతకంటే మంచి ప్రదర్శన ఏం కోరుకుంటాం. ముఖ్యంగా బౌలింగ్ గురించి చెప్పాలి. ప్రత్యర్థిని 127కే ఆలౌట్ చేశాం. ముగ్గురు స్పిన్నర్లు, బుమ్రా సత్తా చాటారు” అని అన్నాడు. కోచ్‌గా టీమ్ఇండియాతో ప్రయాణం ఎలా ఉందన్న ప్రశ్నకు గంభీర్ స్పందిస్తూ.. “కొన్ని మంచి రోజులు చూశా. అలాగే చెడ్డ రోజులు చూశా. కోచింగ్ అంటే అలాగే ఉంటుంది. నిజాయతీగా పని చేయడం ముఖ్యం” అని చెప్పాడు.

# శ్రమించి గెలిచిన శ్రీలంక

ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో శ్రీలంక అనామక హాంకాంగ్ జట్టుపై గెలిచేందుకు శ్రమించింది. సోమవారం గ్రూప్ ‘బి’లో జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక నాలుగు వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా హాంకాంగ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ నిజాకత్ (38 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), అన్షీ రాథ్ (46 బంతుల్లో 48; 4 ఫోర్లు) రాణించారు. అనంతరం ఛేదనలో లంక ఇబ్బంది పడింది. హాంకాంగ్ నిర్ణీత ఓవర్ల కోటాలో కేవలం 4 వికెట్లను కోల్పోతే... శ్రీలంక 20 ఓవర్లయినా ఆడకముందే 6 వికెట్లను కోల్పోయింది. 18.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ నిసాంక (44 బంతుల్లో 68; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీతో అదరగొట్టాడు. 19వ ఓవర్లో హసరంగ (9 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) వరుస బౌండరీలు బాది జట్టును గెలిపించాడు. మరో మ్యాచ్‌లో యూఏఈ 42 పరుగుల తేడాతో ఒమన్‌పై నెగ్గింది. నేడు జరిగే మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌తో బంగ్లాదేశ్ ఆడుతుంది.







# సాత్విక్ జోడీ టైటిల్ సాధించేనా!

షెన్‌జెన్ (చైనా): సుదీర్ఘ కాలంగా టైటిల్ కోసం ఎదురు చూస్తున్న భారత స్టార్ షట్లర్లు లక్ష్యసేన్.. సాత్విక్ సాయిరాజ్ చిరాగ్‌శెట్టి మరో సవాల్‌కు సిద్ధమయ్యారు. మంగళవారం ప్రారంభంకానున్న చైనా మాస్టర్స్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్‌పై మంచి అంచనాలున్నాయి. రెండేళ్ల తర్వాత శనివారం హాంకాంగ్ ఓపెన్‌లో ఫైనల్ చేరుకున్న లక్ష్య.. త్రుటిలో టైటిల్ చేజార్చుకున్నాడు. చైనా మాస్టర్స్‌లో మాత్రం గురి తప్పొద్దని అతను భావిస్తున్నాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)తో లక్ష్య, చౌ తీన్ చెన్ (చైనీస్ తైపీ)తో ఆయుష్ శెట్టి తలపడనున్నారు. ఈ సీజన్‌లో ఆరు సార్లు సెమీఫైనల్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం, హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్ ప్రదర్శనతో సత్తాచాటిన సాత్విక్ చిరాగ్ జోడీ ఎనిమిదో సీడ్‌గా బరిలో దిగుతోంది. అత్యున్నత వేదికలపై నిలకడగా రాణిస్తున్న సాత్విక్ చిరాగ్ జోడీ 16 నెలల టైటిల్ నిరీక్షణకు తెరదించాలని పట్టుదలగా ఉంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో జునైది ఆరిఫ్ రాయ్ కింగ్ యాప్ (మలేసియా) జంటతో సాత్విక్ చిరాగ్ జోడీ పోటీపడనుంది. మహిళల సింగిల్స్‌లో జూలీ జాకబ్‌సేన్ (డెన్మార్క్)తో పి.వి.సింధు.. డబుల్స్‌లో షిన్ యీ కార్మెన్ టింగ్ (మలేసియా)తో రుతుపర్ణ శ్వేతపర్ణ.. మిక్స్‌డ్‌లో యూచి షిమోగ సయాకా హోబారా (జపాన్)తో రోహన్ కపూర్ గద్దె రుత్విక శివాని, ఫెంగ్ యాన్ హువాంగ్ డాంగ్ (చైనా)తో ధ్రువ్ కపిల తనీషా క్రాస్టో తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు.

# టైటాన్స్ ఓటమి



ప్రొ కబడ్డీ లీగ్

జైపుర్: ప్రొ కబడ్డీ లీగ్‌లో సోమవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 32-34 తేడాతో బెంగళూరు బుల్స్ చేతిలో ఓటమి పాలైంది. విరామ సమానికి 9-14తో వెనుకబడ్డ టైటాన్స్.. తర్వాత పుంజుకుని ప్రత్యర్థికి చేరువగా వెళ్లినప్పటికీ ఓటమి తప్పించుకోలేకపోయింది. బెంగళూరు తరపున అలీరెజా (11), టైటాన్స్ తరపున భరత్ (13) టాప్ స్కోరర్లుగా నిలిచారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 40-37తో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. విరామానికి 25-20తో నిలిచిన హరియాణా.. ఆ తర్వాత కూడా స్వల్ప ఆధిక్యాన్ని కొనసాగించింది. క్రమంగా గుజరాత్ పుంజుకుంది. ఓ దశలో 33-33తో స్కోరు సమం చేసింది. కానీ ఆఖర్లో మెరుగైన ప్రదర్శనతో హరియాణా పైచేయి సాధించింది. శివమ్ (12), వినయ్ (8), జైదీప్ (6) హరియాణా విజయంలో కీలక పాత్ర పోషించారు. గుజరాత్ తరపున రాకేశ్ (14) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు.

# చరిత్ర సృష్టించిన యూఏఈ కెప్టెన్.. ప్రపంచ రికార్డు బద్దలు

యూఏఈ కెప్టెన్ ముహమ్మద్ వసీం అంతర్జాతీయ టీ20ల్లో చరిత్ర సృష్టించాడు. బంతుల పరంగా అత్యంత వేగంగా 3000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. వసీంకు ముందు ఈ రికార్డు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ పేరిట ఉండేది. బట్లర్ 3000 పరుగులు పూర్తి చేసేందుకు 2068 బంతులు తీసుకోగా.. వసీం కేవలం 1947 బంతుల్లోనే ఈ ల్యాండ్ మార్క్‌ను తాకాడు. ఈ జాబితాలో వసీం, బట్లర్ తర్వాతి స్థానాల్లో ఆరోన్ ఫించ్ (2077), డేవిడ్ వార్నర్ (2113), రోహిత్ శర్మ (2149) ఉన్నారు. మ్యాచ్‌ల పరంగా చూస్తే.. వసీం మొహమ్మద్ రిజ్వాన్ (పాకిస్తాన్), విరాట్ కోహ్లి (భారత్), బాబర్ ఆజమ్ (పాకిస్తాన్) తర్వాత అత్యంత వేగంగా 3000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ మైలురాయిని చేరుకునేందుకు రిజ్వాన్‌కు 79, విరాట్ కోహ్లికి 81, బాబర్ ఆజమ్‌కు 81 ఇన్నింగ్స్‌లు అవసరం కాగా.. వసీం తన 84వ ఇన్నింగ్స్‌లో 3000 పరుగుల మైలురాయిని తాకాడు. ఆసియా కప్2025లో భాగంగా ఒమన్‌తో ఇవాళ (సెప్టెంబర్ 15) జరుగుతున్న మ్యాచ్‌లో వసీం పై రెండు ఘనతలు సాధించాడు. ఈ మ్యాచ్‌లో వసీం 54 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 69 పరుగులు చేశాడు. వసీంకు జతగా మరో ఓపెనర్ అలీషాన్ షరాఫు (38 బంతుల్లో 51; 7 ఫోర్లు, సిక్స్) కూడా అర్ధ సెంచరీతో రాణించడంతో తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది.

అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనలో ఒమన్ తడబడుతుంది. ఆ జట్టు 6.1 ఓవర్ల తర్వాత 4 వికెట్లు కోల్పోయి 48 పరుగులు చేసింది. షా ఫైసల్ (8), ఆర్యన్ బిస్త్ (5) క్రీజ్‌లో ఉన్నారు. ఈ టోర్నీలో యూఏఈ భారత్, పాక్, ఒమన్‌తో కలిసి గ్రూప్‌ఏలో ఉంది. కొద్ది రోజుల కింద భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ జట్టు చిత్తుగా ఓడింది.




# హ్యాండ్ షేక్ వివాదం.. భారత్‌కు ఫైన్ పడుతుందా? రూల్స్ ఏం చెబుతున్నాయి?



ఆసియాకప్2025 గ్రూపుఎలో భాగంగా ఆదివారం భారత్‌పాకిస్తాన్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో పాక్‌ను 7 వికెట్ల తేడాతో భారత్ చిత్తు చేసింది. అయితే ఈ మ్యాచ్ ఫలితం కంటే హ్యాండ్‌షేక్ వివాదమే ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు పెహల్గమ్ ఉగ్రదాడికి నిరసన తెలిపింది.టాస్ దగ్గర నుంచి మ్యాచ్ పూర్తి అయ్యేంతవరకు పాక్ ఆటగాళ్లను టీమిండియా కనీసం పట్టించుకోలేదు. గతంలో ఇరు జట్లు తలపడినప్పుడు ఆటగాళ్లు ఒకరొకరు పలకరించుకునేవారు. కానీ ఈసారి కనీసం షేక్ హ్యాండ్ కూడా ఇవ్వలేదు. మైదానంలోకి వచ్చామా, గెలిచి వెళ్లామా అన్నట్లు భారత జట్టు తమ వైఖరిని కనబరిచింది. తొలుత టాస్ సందర్భంగా భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అఘాతో కరచాలనం చేసేందుకు నిరాకరించాడు. కనీసం అతడి ముఖం కూడా చూడకుండా సూర్య డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. ఇదంతా ముందుస్తు ప్రణాళికలో భాగంగానే జరిగింది.ఆ తర్వాత మ్యాచ్ ముగిశాక కూడా పాకిస్తాన్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు భారత జట్టు నిరాకరించింది. అంతేకాకుండా పాక్ ప్లేయర్లు టీమిండియా డ్రెసింగ్‌రూమ్ వైపు వెళ్లగా.. సహాయక సిబ్బంది తలుపు మూసేసినట్లు తెలుస్తోంది. దీంతో పాకిస్తాన్ క్రికెట్ టీమ్ అసహనానికి లోనైంది. ఫలితంగా పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్ సెర్మనీని సల్మాన్ ఆఘా బహిష్కరించాడు. ఆ తర్వాత విలేకరుల సమావేశంలో పాల్గొన్న పాక్ హెడ్ కోచ్ మైక్ హసన్ భారత ఆటగాళ్లు తమ పట్ల వ్యవహరించిన తీరు బాధ కలిగించందని చెప్పుకొచ్చాడు.ఈ హ్యాండ్ షేక్ వివాదంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు సైతం స్పందించింది. "భారత ఆటగాళ్లు కరచాలనం చేయకపోవడం పట్ల జట్టు మేనేజర్ నవీద్ చీమా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధం. నిరసనలో భాగంగా తమ కెప్టెన్‌ను పోస్టు మ్యాచ్ సెర్మనీకి పంపలేదని" పీసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ హ్యాండ్ షేక్ వివాదంపై ఏసీసీకి, ఐసీసీకి ఫిర్యాదు చేసేందుకు పీసీబీ సిద్ధమైనట్లు సమాచారం. అంతేకాకుండా ఐసీసీ చర్యలు తీసుకుపోతే యూఏఈతో తమ తదుపరి మ్యాచ్‌ను బహిష్కరిస్తామని పీసీబీ బెదిరిస్తోంది.ఈ క్రమంలో భారత క్రికెట్ జట్టుపై ఐసీసీ చర్యలు తీసుకుంటుందా? అసలు రూల్స్ ఏమి చెబుతున్నాయి? అన్న విషయాలను ఓసారి తెలుసుకుందాం.

ఐసీసీ రూల్స్ ఏం చెబుతున్నాయి?

ఆసియాకప్‌ను ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ నిర్వహిస్తున్నప్పటికి.. ఈ టోర్నీపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌కు పూర్తి అధికారం ఉంటుంది. ఈ టోర్నీలో పాల్గొనే జట్లు, ఆటగాళ్లకు ఐసీసీ ప్రవర్తనా నియమావళి వర్తిస్తుంది. ఐసీసీ ఎల్లప్పుడూ క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహిస్తుంది.ఆటగాళ్లు తమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఐసీసీ కచ్చితంగా చర్యలు తీసుకుంటుంది. కానీ మ్యాచ్ ముగిశాక ఇరు జట్ల ఆటగాళ్లు తప్పనిసరిగా షేక్ హ్యాండ్ ఇవ్వాలనే నిబంధన ఐసీసీ రూల్స్ బుక్‌లో ఎక్కడా లేదు. షేక్ హ్యాండ్ అనేది క్రీడా స్ఫూర్తికి చిహ్నంగా మాత్రమే పరిగణిస్తారు. అదేమి ఖచ్చితమైన రూల్ కాదు. కరచాలనం చేయాలా వద్దా అన్నది పూర్తిగా వారి వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఐసీసీ రూల్ బుక్ ముందు మాటలో ఆటగాళ్లు.. సహచరులను, మ్యాచ్ అధికారులను, అంపైర్లను గౌరవించడం గురుంచి ఉంటుంది. అంతే తప్ప షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడం నేరమని ఐసీసీ తమ రూల్స్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు.ఒకవేళ ఆటగాళ్లతో దురుసగా ప్రవర్తించి కరచాలనం చేయకపోతే దాన్ని ఐసీసీ నేరంగా పరిగణిస్తోంది. కానీ ఈ సందర్భంలో టీమిండియా ఆటగాళ్లు ప్రత్యర్థులను ఏ మాత్రం రెచ్చ గొట్టేలా ప్రవర్తించలేదు. దీంతో భారత జట్టుకు ఐసీసీ ఎటువంటి జరిమానా విధించే అవకాశం లేదు.

బీసీసీఐ స్పందన ఇదే..

ఈ విషయంపై బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు స్పందించారు. "మీకు ఏదైనా సందేహం ఉంటే ఒక్కసారి రూల్ బుక్‌ను చదవండి. అందులో ఎక్కడ కూడా ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు కరచాలనం ఇవ్వాలని ప్రత్యేకంగా ఏమీలేదు. అది కేవలం మర్యాదపూర్వకమైన సంజ్ఞ మాత్రమే. షేక్ హ్యాండ్స్ ఇవ్వాలా లేదా అన్నది వారి సొంత నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. అంతే తప్ప ప్రత్యేకంగా చట్టం ఏమీ లేదు. కాబట్టి ఇండియన్ క్రికెట్ టీమ్ ప్రత్యర్థి జట్టుతో కరచాలనం చేయకపోయిన అదేమి పెద్ద నేరం కాదు" అని సదరు అధికారి పీటీఐతో పేర్కొన్నారు.

# హ్యాండ్ షేక్ వివాదంలో అనూహ్య పరిణామం



భారత్-పాక్ ఆటగాళ్ల హ్యాండ్ షేక్ వివాదంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు విషయాన్ని సరిగ్గా హ్యాండిల్ చేయలేకపోయాడని సొంత అధికారినే సస్పెండ్ చేసింది. జట్టు క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఉస్మాన్ వాహ్లాపై పీసీబీ సస్పెన్షన్ వేటు వేసింది. అధ్యక్షుడు నఖ్వీ బోర్డు అత్యవసర సమావేశం నిర్వహించి వాహ్లాను ఫైర్ చేశాడని తెలుస్తుంది.ఈ విషయాన్ని హ్యాండిల్ చేసే విషయంలో వాహ్లా నుంచి ఎక్కువగా ఆశించాము. అయితే అతను నిరాశపరిచాడు. వాహ్లా కారణంగా భారత్ ముందు పాక్ పరువు పోయింది. టాస్‌కు ముందే మ్యాచ్ రిఫరీ కరచాలనం విషయాన్ని ప్రస్తావించినా, వాహ్లా పరిస్థితిని నియంత్రించడంలో విఫలమయ్యాడని నఖ్వీ అన్నట్లు సమాచారం.కాగా, ఆసియా కప్‌లో భాగంగా నిన్న జరిగిన మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇవ్వని విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత ఆటగాళ్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. సూపర్-4 దశ మ్యాచ్‌లోనూ భారత ఆటగాళ్లు నో హ్యాండ్‌షేక్ పాలసీని కొనసాగించనున్నట్లు తెలుస్తుంది.ఈ విషయంపై పీసీబీ ఇప్పటికే నానా యాగీ చేస్తుంది. భారత ఆటగాళ్లపై చర్యలు తీసుకోవాలని ఐసీసీకి ఫిర్యాదు చేసింది. అలాగే మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను ఆసియా కప్ విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. భారత ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించారని, ఐసీసీ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘనకు పాల్పడ్డారని వారికి తగని నీతులు చెబుతుంది.ఐసీసీ తమ డిమాండ్లను పరిష్కరించకపోతే యూఏఈతో తదుపరి జరుగబోయే మ్యాచ్‌ను బహిష్కరిస్తామని బ్లాక్ మెయిల్ చేస్తుంది. ఐసీసీ మాత్రం ఈ అంశాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడం అన్నది ఆటగాళ్ల వ్యక్తిగతం అంశమని లైట్ తీసుకుంది. పీసీబీ మాత్రం భారత్ ముందు తమ పరువు పోయిందని ఐసీసీ ముందు గగ్గోలు పెడుతుంది.